సాక్షి సంగారెడ్డి

గురువారం । 20 । మార్చి । 2025



భయం వీడితే.. జయం మీదే

విద్యార్థులు పరీక్షలు అంటే భయం వీడాలని పలురంగాల నిపుణులు సూచిస్తున్నారు.


వివరాలు IIలో ▸



నష్టాల 'పాలు'

వ్యవసాయ రంగమే కాదు.. పాడి రైతులు కూడా నష్టాలు పాలవుతున్నారు.

వివరాలు IIలో ▸



పట్టణాభివృద్ధికి పెద్దపీట

- కొత్త మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.4,500 కోట్లు
- బల్దియాలుగా మారిన కోహీర్, ఇస్నాపూర్, గుమ్మడిదల, గడ్డపోతారం
- సింగూరు ప్రాజెక్టుకు పెరిగిన కేటాయింపులు
- ఊసేలేని నంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులు
- నల్లవాగుకు తగ్గిన కేటాయింపులు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు, పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఈ బడ్జెట్ కేటాయింపుల్లో ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. ఇందుకోసం రూ.4,500 కోట్లు కేటాయించింది. జిల్లాలో కొత్తగా మూడు మున్సిపాలిటీలు ఏర్పడిన విషయం విదితమే. చుట్టు పక్కల గ్రామాలను విలీనం చేస్తూ ఇస్నాపూర్, గడ్డపోతారం, గుమ్మడిదలను మున్సిపాలిటీలుగా చేసింది. అలాగే కోహీర్‌ను కూడా మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఈ బడ్జెట్ కేటాయింపుల్లో ఈ కొత్త మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం కలిసొచ్చే అంశమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు సంగారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడ)ను కూడా ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసింది. ఈ పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ అయినప్పటికీ.. దాని ఫంక్షనింగ్ ఇంకా ప్రారంభం కాలేదు. ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా ఈ సంస్థ సేవలు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఊసేలేని సంగమేశ్వర, బసవేశ్వరలు

సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల ఊసు బడ్జెట్‌లో ఎక్కడా కనిపించలేదు. గత ప్రభుత్వ హయాంలో ఈ రెండు భారీ ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టారు. కానీ పనులు ప్రారంభ దశలోనే ఉండి పోయాయి. ఈసారి కేటాయింపుల్లో ఈ రెండు భారీ ఎత్తిపోతల పథకాలకు కేటాయింపులు లేవు.

ఆరు గ్యారెంటీలతో..

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇచ్చింది. ఇందుకోసం రూ.56 వేల కోట్లు కేటాయించింది. ఈ భారీ కేటాయింపులతో ఆయా పథకాల లబ్ధిదారులకు మేలు జరగనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మహాలక్ష్మి సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పథకం లబ్ధిదారులు 1.73 లక్షల మంది ఉన్నారు. అలాగే 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ పథకం గృహజ్యోతి లబ్ధిదారులు 2.16 లక్షల మంది ఉన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఇప్పటి వరకు 1.82 మంది మహిళలు ఉపయోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సూత్రప్రాయంగా అమలు చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈ పథకం లబ్ధిదారుల సంఖ్య 2,170 మందికి మొదటి ఆరు నెలలకు రూ.ఆరు వేల చొప్పున చెల్లించారు. ఈ బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు రూ.56 వేల కోట్లు కేటాయింపులతో ఈ పథకాల లబ్ధి కొనసాగనుంది.

సింగూరుకు రూ.44.85 కోట్లు

ఉమ్మడి జిల్లాలకు సాగు, తాగు నీరు అందిస్తున్న సింగూరు ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024–25లో రూ.14.62 కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్‌లో కేటాయింపులు రూ.44.85 కోట్లకు పెరిగింది. సింగూరు కాల్వల ఆధునీకరణ పనులను ప్రభుత్వం చేపట్టిన విషయం విదితమే. ప్రధాన కాల్వతో పాటు, డిస్ట్రిబ్యూటరీల సిమెంట్ లైనింగ్ పనులకు రూ.143 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులు ఇప్పుడు ప్రారంభ దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత ఏడాది కంటే సుమారు రూ.29 కోట్లు కేటాయింపులు పెరగాయని ఇరిగేషన్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇదే సింగూరు ప్రాజెక్టు నిర్వహణకు ఏటా ఇచ్చే కేటాయింపుల్లో మాత్రం కోత పడింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1.37 కోట్లు కేటాయించగా, ఈసారి ఈ నిధులు కేవలం రూ.పది లక్షలతో సరిపెట్టింది. జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగుకు కూడా కేటాయింపులు తగ్గాయి. గత ఏడాది రూ.9.01 కోట్లు ఉండగా, ఈసారి రూ.5.05 కోట్లకు కేటాయింపులు తగ్గడం గమనార్హం.

ప్రజలను ముంచిన బడ్జెట్



కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేసినందుకు ప్రజలను ముంచే బడ్జెట్‌లా ఉంది. ఈ ప్రభుత్వం నేమ్ చేంజరే తప్ప.. గేమ్ చేంజర్ కాదు. మహిళలకు నెలకు రూ.2,500 చెల్లింపు పథకం ఊసే ఎత్తలేదు కానీ, అందాల పోటీలకు మాత్రం రూ.250 కోట్లు కేటాయించారు.

–చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

ప్రజా వంచన బడ్జెట్



ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను మేడిపండు చందంగా ఉంది. కేవలం ఆంకెల గారడీ తప్ప.. ఎన్నికల్లో హామీల దిశగా కేటాయింపులు లేవు. ఈ బడ్జెట్ కేటాయింపులతో ప్రజాపాలన ప్రభుత్వం కాదని.. ప్రజా వంచన ప్రభుత్వం అన్నట్లుంది. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకానికి నిధులు ఇవ్వలేదు.

–చిన్నమైల్ గోదావరి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు

పేదల సంక్షేమ బడ్జెట్



కొత్త పరిశ్రమలు, వాటి మౌలిక సదుపాయాల కొరకు ఉపయోగపడే బడ్జెట్ ఇది. పేదలు, సామాన్యులకు ఉపయోగపడే విధంగా రూప కల్పన చేశారు. పేదల సంక్షేమ బడ్జెట్. దేశ చిత్రపటంలో తెలంగాణను నిలబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది.

–నిర్మలారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్

న్యూస్‌రీల్

సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట నిఘా: ఎస్పీ



మనూరు పోలీస్ స్టేషన్ తనిఖీ చేస్తున్న ఎస్పీ

నారాయణఖేడ్: సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పటిష్టంగా ఉండాలని ఎస్పీ పంకజ్ పారితోష్ సూచించారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించాక మొదటి సారి మనూరు, నాగల్‌గిద్ద పోలీస్ స్టేషన్లను ఎస్పీ బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్లలో రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసుల పురోగతిపై ఆరా తీశారు. లాకప్ గదులను పరిశీలించారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతాలు అయినందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల నిరోధంపై కఠినంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ వెంకట్‌రెడ్డి, నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకాలకు అన్ని వర్గాలకు చెందిన నిరుద్యోగ యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు ఒక ప్రకటనలో కోరారు. స్వయం ఉపాధి పథకానికి ఒక రేషన్ కార్డుకు ఒకరు మాత్రమే అర్హులు అని పేర్కొన్నారు. పథకం ద్వారా గరిష్టంగా రూ.4 లక్షల వరకు రుణం అందించినట్లు తెలిపారు. తీసుకున్న రుణంలో 60 నుంచి 80శాతం వరకు ప్రభుత్వం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తుకు ఆధార్ కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి అని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన ఏదో ఒక అంశాలలో ఎన్నుకొని స్వయం ఉపాధి పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 5వ తేదీ వరకు ఈ పథకం కింద స్వయం ఉపాధి రుణం కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రైతు రిజిస్ట్రీ అమలు

పైలెట్ ప్రాజెక్టు కింద మొగుడంపల్లి ఎంపిక

జహీరాబాద్ టౌన్: రైతు రిజిస్ట్రీ అమలుకు పైలెట్ ప్రాజెక్టు కింద మొగుడంపల్లి మండలాన్ని ఎంపిక చేసినట్లు వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి అన్నారు. మొగుడంపల్లి రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆధార్‌తో దేశంలోని ప్రతి పౌరునికి గుర్తింపు ఇచ్చినట్లుగా ప్రతీ రైతుకు 11 నంబర్లతో యూనిక్‌కోడ్ (యూసీ)కేటాయించాలని కేంద్రం ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యాజమన్యా వివరాలను రైతు ఆధార్ సంఖ్యను అనుసంధానం చేస్తామని, దీని ద్వారా ఈ ఫార్మర్ ఐడీని కేటాయిస్తామన్నారు. రైతులు వ్యవసాయ విస్తీరణ అధికారిని సంప్రదించాలని ఆయన కోరారు.

హ్యాట్రిక్ కొట్టాడు

మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సాయికిరణ్‌రెడ్డి



జహీరాబాద్/న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రస్తుతం ఆధునిక పోటీ ప్రపంచంలో ఒక ప్రైవేట్ ఉద్యోగం సాధించడం అంత సులువైంది కాదు. అందులో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే అహర్నిశలు కష్టపడి ఎంతో శ్రమించాల్సి ఉంటుంది. మరి ఓపెన్ కాంపిటేషన్‌లో ఉద్యోగం సాధించాలంటే ఎంత శ్రమకోర్చి చదవాలో అది కష్టపడే వారికే తెలుస్తుంది. కానీ న్యాల్‌కల్ మండలం చీకుర్తి గ్రామానికి చెందిన యువకుడు నాగారం సాయికిరణ్‌రెడ్డి(25) ఓపెన్ కాంపిటేషన్‌లో పోటీపడి ఏడాది కాలంలోనే మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తానేంటో నిరూపించుకున్నాడు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్–4 పరీక్షలో జిల్లాలో మూడవ ర్యాంకు సాధించగా, ఆయనకు మొదటగా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగం లభించింది. ప్రస్తుతం ఆయన సదాశివపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. అదే విధంగా ప్రభుత్వం జూనియర్ లెక్చరర్ల కోసం ప్రభుత్వ పోటీ పరీక్షలు నిర్వహించగా అందులో రాష్ట్రంలో 14వ ర్యాంకు రాగా మెరిట్ కోటాలో ఉద్యోగం సంపాదించాడు. అలాగే గ్రూప్–2 పరీక్షలో రాష్ట్రంలో 75వ ర్యాంకు రాగా, మెరిట్ కోటాలో ఉద్యోగం సాధించి సాయికిరణ్‌రెడ్డి తన సత్తాను చాటాడు. ఏడాది కాలంలోనే మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి పలువురికి స్ఫూర్తి నింపుతున్నాడు.

పదికి పకడ్బందీ ఏర్పాట్లు

- రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- సమయం ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు..



సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఈ నెల 21వ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో రాసేందుకు జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఐదు నిమిషాల సడలింపు అమలులో ఉంది. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది. ప్రతి పరీక్ష కేంద్రం అత్యవసర పరిస్థితులలో ప్రాథమిక చికిత్స అందించేందుకు మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. తాగు నీటి సమస్య లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

జిల్లాలో 22,423 మంది విద్యార్థులు

జిల్లాలో 22,423 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలలో రెగ్యులర్ విద్యార్థులు 22,411 కాగా ప్రైవేట్ విద్యార్థులు (గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు) 12 మంది ఉన్నారు. జిల్లాలో 122 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకై ఏదైనా సమాచారం, సందేహాలపై జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. ఏదైనా సందేహాలు ఉన్నట్లయితే 08455–276255, 8979677495ను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. దీంతో పాటు ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సంబంధిత మండల విద్యాధికారి, జిల్లా విద్యాధికారి, తహసీల్దార్, ఎంపీడీఓ, మండల వైద్యశాఖ అధికారి మొబైల్ నంబర్లు డిస్‌ప్లే చేయాలని సంబంధిత చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేశారు. సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎట్టి పరిస్థితులలో మొబైల్ ఫోన్‌లు, స్మార్ట్ వాచ్‌లతో పాటు ఇతర ఏ ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాలలోకి అనుమతించరు.
- విద్యార్థులు సమయానికి ఒక గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.
- హాల్ టికెట్, పెన్ను, పెన్సిల్, రైటింగ్‌ప్యాడ్‌ను వెంట తీసుకొని రావాలి
- హాల్ టికెట్ అందని, పోగొట్టుకున్న విద్యార్థులు www.bre.teanfana.gov.in అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి
- పరీక్ష రాసేందుకు వచ్చే విద్యార్థులు తమ పాఠశాల యూనిఫాంలో కాకుండా ఇతర దుస్తువులో హాజరు కావాలి.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరు కావాలి



పరీక్షలు రాసేందుకు సంసిద్ధమవుతున్న విద్యార్థులకు ముందుగా బెస్ట్ ఆఫ్ లక్. విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడే అవకాశం లేకుండా ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఒక్కో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారితో పాటు సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించాం. విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో పరీక్షలకు హాజరు కావాలి.

– వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి

ఓటరు జాబితా సవరణ

- రాజకీయ పార్టీలు సహకరించాలి
- ట్రైనీ కలెక్టర్ మనోజ్



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్

జహీరాబాద్ టౌన్: స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీలు సహకరించాలని ట్రైనీ కలెక్టర్ మనోజ్ కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొరపాట్లు లేకుండా ఓటరు జాబితా ఉండాలన్నారు. బీఎల్ఓలు 18 సంవత్సరాలు పైబడిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు, జాబితాలో సవరణలు చేయడం వంటివి చేపడుతామన్నారు. 6,7,8ల ఫారాల నిర్వహణ పకడ్బందీగా ఈ నెల 23వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. నూతన ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుపై వచ్చే దరఖాస్తును ఎలక్షన్ కమిషన్ నిబంధనలకు లోబడి పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాంరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అక్రమ ఇటుక బట్టీల ధ్వంసం

సాక్షి స్పందన

జహీరాబాద్: 'సాక్షి' కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు బుధవారం అక్రమంగా ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలపై కొరడా ఝళిపించారు. ఈనెల 16వ తేదీన 'సాక్షి'లో 'పంట పొలాల్లో ఇటుక బట్టీలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. బుధవారం జేసీబీ సహాయంతో జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్ గ్రామ శివారులో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలను ధ్వంసం చేశారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఇటుక బట్టీల వివరాలను సేకరించారు. ఇప్పటి వరకు 15 వరకు అక్రమ ఇటుక బట్టీలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిలో చిన్న హైదరాబాద్‌లో ఒకటి, హోతి(బి)లో 7, శేఖాపూర్, కొత్తూర్(బి)లో రెండు, ఆనెగుంట గ్రామాల్లో ఒకటి, హోతి(కె)లో 2, జహీరాబాద్‌లో ఒకటి వంతున అక్రమ ఇటుక బట్టీలు ఉన్నట్లు గుర్తించారు. మరిన్ని అక్రమ ఇటుక బట్టీల వివరాలను రెవెన్యూ సిబ్బంది సేకరిస్తున్నారు. ఇటుక బట్టీలకు అనుమతులు పొందాలని, లేనట్లయితే చట్ట పరంగా చర్యలు చేపడుతామని రెవెన్యూ అధికారులు యజమానులను హెచ్చరించారు.



ఇటుక బట్టీలను ధ్వంసం చేస్తున్న దృశ్యం

ఇంటివద్దకే రాములవారి తలంబ్రాలు

జహీరాబాద్: స్థానిక ఆర్టీసీ బస్సు డిపో లాజిస్టిక్ ద్వారా భక్తులకు ఇంటి వద్దకే భద్రాద్రి సీతారాముల తలంబ్రాలు చేర్చుతామని డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు జహీరాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో లాజిస్టిక్ ఆఫీసులో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ కార్గో ఏజెంట్ వద్ద రూ.151 చెల్లించి బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 6వ తేదీ వరకు బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని సూచించారు. బుకింగ్ చేసుకున్న భక్తులకు కల్యాణ అనంతరం తలంబ్రాలు ఇళ్ల వద్దకే అందజేస్తామన్నారు. సీతారాముల కల్యాణానికి వెళ్లలేని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తలంబ్రాలు బుకింగ్ కోసం సెల్: 91820 21588ను సంప్రదించాలని కోరారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామ పరిధిలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలల్లో 6, 7, 8 ,9 తరగతులలో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగజ్యోతి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఏప్రిల్ 20వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్లు ఏప్రిల్ 15న డౌన్ లోడ్ చేసుకోవాలని, పరీక్ష ఏప్రిల్ 20న నిర్వహిస్తారని, మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

జిల్లాకు ఐదు పీహెచ్‌సీలు మంజూరు

- మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం: డీఎంహెచ్ఓ
- నేరడిగుంట పీహెచ్‌సీ తాత్కాలిక భవనం ప్రారంభం



నేరడిగుంటలో పీహెచ్‌సీ తాత్కాలిక భవనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ గాయత్రిదేవి

వట్‌పల్లి(అందోల్): గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ గాయత్రిదేవి అన్నారు. బుధవారం అందోలు మండలం నేరడిగుంటలో పీహెచ్‌సీ తాత్కాలిక భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో 30 వేలు, గిరిజన ప్రాంతాల్లో 20వేల జనాభా ప్రాతిపదికన పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలన్న నిబంధనల మేరకు జిల్లాలో కంకోల్, సింగీతం, బర్దిపూర్, నేరడిగుంట, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో నూతనంగా ఐదు పిహెచ్‌సీలు మంజూరయ్యాయని తెలిపారు. నేరడిగుంట పీహెచ్‌సీ పరిధిలో 40వేల మంది జనాభ ఉందని, ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోకి 11 సబ్‌సెంటర్‌లు, 25 గ్రామాలు వస్తాయన్నారు. నేరడిగుంట ఆసుపత్రికి వైద్యాధికారిగా డాక్టర్ శంకర్‌తో పాటు సిబ్బందిని డిప్యుటేషన్‌పై నియమించామని పేర్కొన్నారు. పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.46 కోట్లు కేటాయించిందని, అయితే.. కేటాయించిన స్థలం సరిపోదని మరో 20 గుంటలు అవసరమన్నారు. స్థలాన్ని కేటాయిస్తే వెంటనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బి.శివరాజ్, ఎంపీఓ సోంనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లయ్య, మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి, పాల్గొన్నారు.

ఉపాధిలో జల సంరక్షణకు ప్రాధాన్యం

- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- వర్షపు నీరు వృథా కాకుండా చర్యలు



సంగారెడ్డి జోన్: వర్షపు నీరు వృథా పోకుండా సంరక్షించుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉపాధి హామీ పథకంలో భాగంగా జల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు చేపట్టింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పనులు చేపట్టేందుకు ప్రజల భాగస్వామ్యంతో గ్రామ సభలను నిర్వహించి వివిధ రకాల పనులను గుర్తించారు. కూలీలకు ఉపాధి కల్పించడంతోపాటు ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే విధంగా చర్యలు చేపట్టారు. గ్రామ సభల్లో జల సంరక్షణ పనులపై అవగాహన కల్పించారు. గతంలో జల శక్తి అభియాన్, వాటర్ షెడ్‌తో పాటు పథకాలను ప్రవేశపెట్టి పలు రకాల పనులు చేపట్టారు.

జల సంరక్షణలో చేపట్టే పనులు

జల సంరక్షణలో భాగంగా చేపట్టే పనుల్లో ముఖ్యంగా వ్యవసాయ పంట పొలాల వద్ద నీరు నిలిచి ఉండే విధంగా పనులు చేపట్టనున్నారు. వాగులు, వంకలలో పూడికతీత, బోరు బావులు, చేతి పంపులు, ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణాలు, ఇంటి పై భాగంలో కురిసిన వర్షపు నీరు భూమిలోకి ఇంకే విధంగా రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిర్మాణాలు, కందకాలు తవ్వటం, నీటి కుంటల నిర్మాణాలు, నీటి నిలువ కుంటలు, పర్క్యులేషన్ ట్యాంకులు, పొలాల మధ్య కాల్వలు తదితర పనులు చేపడుతారు.

2 లక్షల జాబ్ కార్డులు.. 4 లక్షల మంది ఉపాధి కూలీలు

ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పించడమే లక్ష్యంగా తీసుకున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 2 లక్షల 19వేల మందికి జాబ్ కార్డులు మంజూరు చేయగా.. 4 లక్షల 3 వేల మంది కూలీలుగా నమోదు అయ్యారు. అందులో 1,32,000 జాబ్ కార్డులు యాక్టివ్ ఉండగా.. రెండు లక్షల 25 వేల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు.

క్లుప్తంగా

లారీ, వ్యాన్ ఢీ: డ్రైవర్ మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం

నారాయణఖేడ్: ఎదురెదురుగా వ్యాన్, లారీ ఢీకొనడంతో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన నిజాంపేట్–ఖేడ్–బీదర్ 161బి జాతీయ రహదారిపై ర్యాలమడుగు గ్రామం వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన వాజీద్ (35) మినీ వ్యాన్‌లో ఖేడ్‌లో మందులు సరఫరా చేసి తిరిగి వెళ్తున్నాడు. ర్యాలమడుగు సమీపంలోకి రాగానే నిజాంపేట్ వైపు నుంచి వస్తున్న లారీ ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాజీద్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ వాహనంతో పరారు కాగా పోలీసులు కేసు నమోదు చేశారు.

కుక్కను తప్పించబోయి ..
స్కూటీపై నుంచి పడి యువకుడు మృతి

తూప్రాన్: స్కూటీ నుంచి కిందపడి యువకుడు దుర్మరణం చెందిన ఘటన పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై లింగారెడ్డిపేట చౌరస్తా వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన చాకలి బొంతపల్లి కృష్ణ (32) యువకుడు అనారోగ్యంతో పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి స్కూటీపై వచ్చాడు. తిరుగు ప్రయాణంలో లింగారెడ్డిపేట చౌరస్తా వద్ద రహదారిపై అడ్డు వచ్చిన కుక్కను తప్పించబోయి కిందపడి గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి

నర్సాపూర్ రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన నర్సాపూర్ – మెదక్ రహదారిలో రెడ్డిపల్లి గేటు వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్‌ఐ లింగం కథనం మేరకు.. మేడ్చల్ జిల్లా దుండిగల్ గ్రామానికి చెందిన గడ్డమీది మహేశ్(33) రెడ్డిపల్లి గేటు వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌పై వెళ్తూ వ్యక్తి..

జగదేవ్‌పూర్(గజ్వేల్): బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మునిగడప గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. వరంగల్ జిల్లా రామన్నపేట గ్రామానికి చెందిన నరేశ్(40) ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లోని వినాయకనగర్‌లో భార్యా పిల్లలతో కలిసి ఉంటున్నాడు. బుధవారం స్వగ్రామం రామన్నపేట నుంచి బైక్‌పై బియ్యం బస్తా వేసుకొని బయలుదేరాడు. రాత్రి 8 గంటల ప్రాంతంలో మునిగడప గ్రామానికి రాగానే బైక్‌పై నుంచి కిందపడి ప్రాణాలు వదిలాడు. గుండెపోటు లేదా వడదెబ్బతో మృతి చెంది ఉన్నట్లు పోలీ సులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యా దు మేరకు పోలీసు కేసు నమోదు చేశారు.

ఐదు రోజుల వ్యవధిలో అన్నాదమ్ముళ్లు

హుస్నాబాద్‌రూరల్: ఐదు రోజుల వ్యవధిలో అన్నాదమ్ముళ్లు మృతి చెందిన ఘటన హుస్నాబాద్ మండలం నాగారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పొన్నాల లచ్చవ్వ లింగయ్య దంపతులకు ముగ్గురు కుమారులు ఉండగా అందరికీ పెళ్లిలు అయ్యాయి. అనారోగ్యంతో 14న పొన్నాల ప్రభాకర్ మృతి చెందగా, బుధవారం పొన్నాల రవీందర్ సిద్దిపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇద్దరు కుమారుల మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. రవీందర్ గ్రామ పంచాయతీ కార్మికుడిగా పని చేస్తుండగా, ప్రభాకర్ హుస్నాబాద్ పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు.

నిషేధిత ఆల్ఫాజోలం పట్టివేత
పోలీసుల అదుపులో ఇద్దరు



మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

హత్నూర(సంగారెడ్డి): ఓ ఇంటిపై ఎక్సైజ్ ఇన్‌ఫోర్స్‌మెంట్ పోలీస్ అధికారులు దాడి చేసి నిషేధిత ఆల్ఫాజోలం పట్టుకున్నారు. ఈ ఘటన హత్నూర మండలం దౌల్తాబాద్ బస్టాండ్ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ప్రొఫెషనల్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మెదక్ డివిజన్ ఏఈఎస్ ఎస్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు. అధికారుల కథనం మేరకు.. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన రాజా గౌడ్, సిద్దిపేట ప్రాంతానికి చెందిన చిత్తాపూర్ గ్రామానికి చెందిన నర్సాగౌడ్ ఇద్దరూ నిషేధిత ఆల్ఫాజోలం 503 గ్రాములు, డయజోఫామ్ 17 గ్రాములు ఇంట్లో నిల్వ చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు దాడి చేసి సుమారు రూ.5 లక్షల విలువ చేసే మత్తు పదార్థాలు పట్టుకున్నాం. ఇద్దరిని అదుపులోకి తీసుకొని అందోల్ ఎక్సైజ్ సీఐకి అప్పగించినట్లు తెలిపారు.

భయం వీడితే.. జయం మీదే

ప్రశాంతంగా పది పరీక్షలు రాద్దాం
- ముందు వచ్చినవి.. తర్వాత రానివి రాయాలి
- హడావిడి లేకుండా పరీక్ష కేంద్రానికి చేరుదాం
- జంక్ ఫుడ్ వద్దు.. ద్రవరూప ఆహారమే ముద్దు..
- విద్యార్థులకు పలు రంగాల నిపుణుల సూచన
- పరీక్షలు రానున్న 14,124 మంది



సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

రేపటి నుంచి జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అందుకుగాను విద్యాశాఖ అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. పది పరీక్షలు విద్యార్థుల జీవితాల్లో తొలిమెట్టుగా భావిస్తారు. పరీక్షలు అనగానే విద్యార్థులు హడావిడి, భయం, ఆందోళన, ఒత్తిడికి గురవుతుంటారు. ఇవన్నీ దూరంగా పెట్టుకుంటేనే ప్రశాంతంగా పరీక్షలు రాయగలుగుతామని, అనుకున్న విజయాన్ని సాధిస్తామని పలురంగాల నిపుణులు విద్యార్థులకు సూచనలు, సలహాలు చేశారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

జిల్లాలోని ప్రభుత్వ, గురుకులాలు, కేజీబీవీలు, ఆదర్శ, ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న 14,124 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. వీరితో పాటుగా 1,763 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అందుకోసం జిల్లాలో 79 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పదవ తరగతి పరీక్షల నిర్వహణ కోసం 79 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 79 చీఫ్ డిపార్ట్‌మెంటల్ అధికారులు, నలుగురు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఏడుగురు రూట్ ఆఫీసర్స్‌లు, 50 మంది స్టోరేజీ పాయింట్ కస్టోడియన్, 707 మంది ఇన్విజిలెటర్‌లు పరీక్షల నిర్వహణలో భాగస్వామ్యం కానున్నారు. ఇప్పటికే పదవ తరగతి పరీక్ష పేపర్‌లను జిల్లాలోని 25 స్టోరేజ్ పాయింట్‌లలో భద్రపరిచారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేయనున్నారు.

టోల్‌ఫ్రీ నంబర్లు

పదవ తరగతి విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్‌లకు ఫోన్ చేసి వారిని సంప్రదించి సమస్యకు పరిష్కారం పొందే విధంగా ఏర్పాట్లు చేశారు. పదవ తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకు 98664 15124, 99088 73455 నంబర్లు 24 గంటలు అందుబాటులో ఉండనున్నాయి.

5 నిమిషాల నిబంధన అమలులో..

పరీక్ష కేంద్రాలల్లోకి వెళ్లేందుకు విద్యార్థులకు పరీక్ష సమయం కంటే 30 నిమిషాలు ముందుగానే అనుమతి ఉంటుంది. అందువలన విద్యార్థులు ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకొని హాల్‌లో కూర్చునే అవకాశం ఉంది. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవడం ఉత్తమం. 5 నిమిషాల నియమం అమలులో ఉన్నందున పరీక్ష కేంద్రానికి త్వరగా చేరుకోవాలి. హడావిడిగా తీరా సమయానికి పరీక్షకు బయలు దేరితే కేంద్రానికి చేరుకోవడానికి ఆలస్యమయ్యే అవకాశం ఉంటుంది.

163 బీఎన్‌ఎస్‌ఎస్ నిబంధనలు
సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: జిల్లాలో పదవ తరగతి పరీక్షలు జరుగనున్న పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ నిబంధనలు అమలులో ఉంటాయని సిద్దిపేట సీపీ అనురాధ బుధవారం తెలిపారు. 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పరీక్షలు జరుగనున్నందున ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పై నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడి ఉండకూడదని, సమీపంలోని అన్ని జీరాక్స్ సెంటర్లను మూసివేసి ఉంచాలని పేర్కొన్నారు. పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సీపీ ఆదేశించారు.

అర్ధరాత్రి వరకు చదవొద్దు



ఆన్సర్ బుక్‌లెట్ పైన ఎలాంటి పేరు గాని, ఇతర వివరాలు రాయరాదు. ఇన్విజిలేటర్‌లు చేప్పే ప్రతీ సూచన తప్పకుండా పాటించాలి. ఆన్సర్‌షీట్‌లో కొట్టివేతలు లేకుండా నీట్‌గా జవాబులు రాయాలి. తెలిసిన ప్రశ్నలకు జవాబుల నుంచి తెలియని ప్రశ్నలకు జవాబులు రాయడం ద్వారా సమయం ఆదా అవుతుంది. రాత్రి 10 గంటల వరకే చదవాలి, ఉదయం 4.30 గంటలకు నిద్ర లేచి చదవడం మంచిది. అర్ధరాత్రి వరకు చదవడం వలన పరీక్ష హాల్‌లో నిద్ర రావడం, ఇబ్బందికరంగా మారుతుంది. ఘన రూప ఆహారం కాకుండా, ద్రవరూప ఆహారాన్ని తీసుకోవడం మంచిది.

-రాధారి నాగరాజు, మోటివేషనల్ స్పీకర్, లైఫ్ స్కిల్స్ కోచ్, సిద్దిపేట

విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్



పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు శుభాభినందనలు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ధైర్యంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలి. కొన్నేళ్లుగా రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లా ఉత్తమ ఫలితాలు సాధిస్తుంది.. ఈ సంవత్సరం కూడా ఉత్తమ ఫలితాలు సాధించండి. జిల్లా కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలి. గతేడాది కంటే ఈ సంవత్సరం 10 జీపీఏలు అధికంగా సాధించే విధంగా పరీక్షలు రాయండి. తల్లిదండ్రుల, గురువుల, పాఠశాలల పేరును నిలబెట్టండి.

-శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

ప్రశాంతంగా పరీక్షలు రాయండి



విద్యార్థులు ఆందోళన లేకుండా పరీక్షలు రాయండి. తెలిసిన జవాబుల నుంచి తెలియని జవాబుల వైపునకు రాయండి. దీంతో సమయం పూర్తిగా ఆదా అవుతుంది. మానసికంగా ప్రశాంతంగా ఉంటుంది. రాని ప్రశ్నలను పట్టుకొని సమయం వృధా అవుతుంది. అదే విధంగా పరీక్ష కేంద్రంలో ఇతరులతో మాట్లాడటం లాంటివి చేస్తూ తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయొద్దు. ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలి.

-జగ్గు మల్లారెడ్డి, ప్రముఖ విద్యావేత్త, బీస్మాట్ స్టేట్ జనరల్ సెక్రటరీ

జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి



పరీక్షలు వెళ్లే ముందు విద్యార్థులు మితంగా ఆహారం తీసుకోవాలి. అధికంగా ఘన రూప ఆహారం కాకుండా, ద్రవ రూప ఆహారం తీసుకోవడం ఉత్తమం. మసాల, జంక్ ఫుడ్‌లకు పరీక్ష సమయంలో దూరంగా ఉండటం మంచిది. రాత్రి 10 గంటల వరకు పడుకోవాలి. రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం ద్వారా పగలు పరీక్ష హాల్‌లో నిద్ర వచ్చే అవకాశం ఉంటుంది. అదే విధంగా పరీక్ష రాసే సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది.

-డాక్టర్ గణేశ్ వెనిశెట్టి, జనరల్ ఫిజిషియన్, సిద్దిపేట

చెరువులో తల్లీకూతుళ్ల మృతదేహాలు లభ్యం

- మృతులు మెదక్ జిల్లా వాసులు
- 17న ఇంటి నుంచి వెళ్లి అదృశ్యం



విజయలక్ష్మి, మణిదీపిక

సంగారెడ్డి క్రైమ్: మహబూబ్ సాగర్ చెరువులో తల్లీకూతుళ్ల మృతదేహాలు లభ్యమైన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగు చూసింది. పట్టణ సీఐ రమేశ్.. మెదక్ జిల్లాలోని బ్రాహ్మణవీధికి చెందిన ముద్దుల సత్యనారాయణ ప్రభుత్వ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడికి భార్య విజయలక్ష్మి (54), కూతురు మణిదీపిక (27), కుమారుడు మణిదీప్ ఉన్నారు. 17న సోమవారం విజయలక్ష్మి, మణిదీపిక ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అదే రోజు సాయంత్రం మెదక్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో భర్త ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం ఉదయం సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువులో తల్లీకూతురు మృతదేహాలై కనిపించారు. చెరువులో గుర్రపుడెక్క తొలగించే ఇన్‌చార్జి సురేందర్ గమనించి పట్టణ పోలీసులకు సమాచారం అందించాడు. చెరువులో నుంచి మృతదేహాలను బయటకు తీసి వారి వద్ద ఉన్న ఆధార్ కార్డు, బస్సు టిక్కెట్ల ఆధారంగా మృతులు మెదక్ జిల్లా వాసులుగా గుర్తించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బియ్యం పట్టివేత

నారాయణఖేడ్: అక్రమంగా రవాణా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కల్హేర్ పోలీసులు పట్టుకొని ఖేడ్ సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. ఏపీలోని పోరుబందర్‌కు చెందిన లారీ డ్రైవర్ కిషోర్ కాంత్ విజయవాడలో నరేశ్ అనే వ్యక్తి వద్ద పీడీఎస్ బియ్యం కొనుగోలు చేశాడు. 300 క్వింటాళ్లు గుజరాత్‌కు లారీలో తరలిస్తుండగా మాసాన్‌పల్లి వద్ద పట్టుకున్నాం. మంగళవారం మూడు లారీలు పట్టుకోగా రెండు లారీలపై కేసు నమోదు చేశారు. మరో లారీపై బుధవారం కేసు నమోదు చేశారు. లారీ డ్రైవర్, బియ్యం అమ్మిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కల్హేర్ పోలీసులు వివరించారు.

కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశాలు, సీఐటీయూ నాయకులు

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

సిద్దిపేటరూరల్: రాష్ట్రంలో ఆశా వర్కర్‌లకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించి, సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. బుధవారం ఆశాల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గోపాల్ స్వామి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి నేడు మర్చిపోయిందన్నారు. సమస్యలు పరిష్కారించాలని మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఉన్నతాధికారులకు ఆశాలు అనేక వినతిపత్రాలు అందించారన్నారు. ఎన్నో ధర్నాలు, ఆందోళనలు చేసినా ఎలాంటి స్పందనలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. 5లక్షలు, చనిపోతే రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా కోశాధికారి జీ.భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్, జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల నర్సయ్య, కొంపల్లి భాస్కర్, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలమని, ప్రవీణ చల్లారపు నీరజ, కవిత, భాగ్యలక్ష్మీ, స్వప్న, వరలక్ష్మీ, విజయ, లక్ష్మీ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వలస కూలీ ఆత్మహత్య

ఝరాసంగం(జహీరాబాద్): వలస కూలీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బీహార్ రాష్ట్రంలోని మధుబాని జిల్లా పరిధిలోని సోహపూర్ గ్రామానికి చెందిన కృష్ణ కుమార్ సదా(26) కూలీ పనులు చేసుకునేందుకు మంగళవారం ఉదయం ఝరాసంగం మండల పరిధిలోని గంగాపూర్ గ్రామానికి కుటుంబ సభ్యులతో కలిసొచ్చాడు. పనికి వెళ్ల కుండా ఆ రోజు ఇంటి వద్దే ఉన్నారు. చేసిన అప్పులు తీర్చలేక బాధపడుతూ మనస్తాపంతో తాత్కాలికంగా నివాసం ఉంటున్న షెడ్డులో కరెంటు తీగ వైరుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం మృతుడి భార్య శకుంత దేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని వ్యక్తి..

మునిపల్లి(అందోల్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కంకోల్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ కథనం మేరకు.. సదాశివపేట మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన నడుమిదొడ్డి పాపయ్య (48)కి మతి స్థిమితం సరిగా లేదు. దీంతో అల్లుడు ముత్యాల శివకుమార్ మామ పాపయ్యను ఆత్మకూర్ నుంచి పొల్కంపల్లి గ్రామానికి తీసుకొచ్చి తన ఇంట్లోనే పెట్టుకున్నాడు. 16న అర్ధరాత్రి ఇంట్లో నుంచి పాపయ్య బయటికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు, బంధువులు వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం కంకోల్ గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకొని ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతుడి అల్లుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిరుత ఆచూకీ కోసం ట్రాప్ కెమెరాలు



చిరుత సంచరించిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు, పోలీసులు

- అనుమానిత ప్రాంతాల్లో ఏర్పాటు
- కాలి ముద్రలు సేకరణ
- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- ఫారెస్ట్ రేంజ్ అధికారి సందీప్ కుమార్

దుబ్బాకటౌన్: చిరుత సంచార ప్రాంతాల్లో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని దుబ్బాక ఫారెస్ట్ రేంజ్ అధికారి సందీప్ కుమార్ అన్నారు. రాయపోల్–తిమ్మక్కపల్లి గ్రామ శివారులో గల్వని చెరువు ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తున్నట్లు తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఆచూకీ కోసం బుధవారం ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా అధికారులు అనుమానిత ప్రాంతాలను సందర్శించి రైతుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం సందీప్ కుమార్ మాట్లాడుతూ.. చిరుత పులి సంచరిస్తూ.. రైతులకు కనిపించిన ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కాలి ముద్రలు సేకరించి చిరుత పులివేనని నిర్ధారించామన్నారు. చిరుత పులి ఎప్పుడు ఒకే చోట నివాసం ఉండదని తరచూ తిరుగుతుంటుందని సూచించారు. రైతులు గొర్రెలు, మేకలు, పశువులను పొలాల వద్ద ఉంచొద్దన్నారు. చిరుత పులి కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రైతులెవరూ పొలాల చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాట్లు చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో రాయపోల్ ఏఎస్‌ఐ దేవయ్య, సెక్షన్ ఆఫీసర్లు హైమద్ హుస్సేన్, బీట్ ఆఫీసర్లు జహంగీర్, వేణు, కానిస్టేబుల్ స్వామి, సిబ్బంది తదితరులున్నారు.

హన్మంత్‌రావుపేట్‌ను ఆదుకోండి
సీపీఎం నాయకులు మాణిక్

నారాయణఖేడ్: చేనేత వస్త్ర పరిశ్రమగా పేరుగాంచి నేడు దయనీయంగా మారిన హన్మంత్‌రావుపేట్ గ్రామాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. 'సాక్షి' దినపత్రికలో 'సిరుల దారం నిరాధారం' శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించి వారి జీవన పరిస్థితులపై ఆరా తీశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని హన్మంత్‌రావు పేట్ చేనేత వస్త్రాల తయారీకి పెట్టింది పేరుగా నిలిచింది. హన్మంత్‌రావు పేట్, సత్తెగామ, ఖేడ్‌ల్లో నేత కార్మికులు ఉన్నారు. యంత్రాల రంగప్రవేశంతో నేత కార్మికులు ఉపాధి కోల్పోయి కుటుంబాలు గడవని పరిస్థితి నేడు నెలకొందన్నారు. చాలా మంది బతుకుజీవుడంటూ వలస వెళ్లడంతో వారి ఇళ్లు శిథిలావస్థకు చేరి కూలిపోయాయి.. దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్నారని అన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

పురుగు మందు తాగి..



పోచయ్య (ఫైల్)


నర్సాపూర్ రూరల్: కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చిన్నచింత కుంట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్‌ఐ లింగం కథనం మేరకు.. గ్రామానికి చెందిన బండ పోచయ్య (50) కుటుంబ కలహాలతో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదవశాత్తు కిందపడ్డ వ్యక్తి..

మునిపల్లి(అందోల్): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు చెందాడు. బుధవారం ఎస్‌ఐ రాజేశ్ నాయక్ కథనం మేరకు.. యాదాద్రి జిల్లా భువనగిరికి చెందిన సతీష కుమార్ (28) ఈ నెల 18న బుదేరా పెట్రోల్ పంపులో షెడ్ వేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కిందపడి గాయాల పాలయ్యాడు. వెంటనే క్షతగాత్రుడిని సంగారెడ్డిలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పత్తి తూకంలో వ్యాపారి మోసాలు

- ఇసుక సంచులు, బాట్లు వేసి ఖాళీ వాహనాన్ని తూకం
- రైతుల అప్రమత్తతతో వెలుగులోకి..



ఇసుక సంచులు, తూకం బాట్లు చూపుతున్న రైతులు

వట్‌పల్లి(అందోల్): రైతులనే బోల్తా కొట్టించబోయిన ఓ దొంగ వ్యాపారి అడ్డంగా దొరికిపోయాడు. ఈ ఘటన మండల పరిధిలోని దరఖాస్తుపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. రైతుల కథనం మేరకు.. వట్‌పల్లికి చెందిన అసస్ అనే ఓ వ్యాపారి దరఖాస్తుపల్లి గ్రామంలో పత్తిని తూకం వేసేందుకు వచ్చాడు. ముందుగా తన ఖాళీ వాహనాన్ని తూకం వేసే సమయంలో రెండు ఇసుక సంచులతోపాటు ఆరు బాట్లను వాహనంలోనే ఉంచి తూకం వేశాడు. దరఖాస్తుపల్లి గ్రామంలో పత్తి తూకం వేసే సమయంలో వాహనంలో ఇసుక బస్తాలను చూసి అవాక్కయ్యారు. వాహనంలో ఇసుక బస్తాలు, బాట్లు వేసి తూకం వేశావని నిలదీశారు. సుమారుగా 4 క్వింటాళ్ల వరకు ఉన్న వాటితో అంతే మొత్తంలో పత్తిని నష్టపోయేవారమని వ్యాపారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న వట్‌పల్లి పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. దీంతో మరికొందరు రైతులు ఇదివరకు ఇదే వ్యాపారికి మమ్మల్ని ఇలానే మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు వాహనంతోపాటు ఇసుక బస్తాలు, తూకపు బాట్లను స్టేషన్‌కు తరలించారు. దీంతో వ్యాపారి దిగొచ్చి తన మోసాన్ని ఒప్పుకొని ఓ రైతుకు రూ. 50 వేలు చెల్లించడంతోపాటు మిగితా రైతులకు క్షమాణలు చెప్పడంతో పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు చేయలేదు.

నష్టాల పాలు

- రైతుల నుంచి పాలు కొనుగోలు చేయని హట్సన్ కంపెనీ
- తక్కువ ధర ఇస్తున్న విజయ డెయిరీ
- గిట్టుబాటుకాక పాడి రైతుల ఆందోళన
- భారంగా మారిన పశుపోషణ
- నేడు జహీరాబాద్‌లో ధర్నా

జహీరాబాద్ టౌన్: వ్యవసాయ రంగమే కాదు.. పాడి రైతులు కూడా నష్టాలు పాలవుతున్నారు. పశుపోషణ మోయలేని భారంగా తయారవుతుంది. పాలకు గిట్టుబాటు ధర రాక అప్పుల పాలవుతున్నారు. ప్రభుత్వాలు చేయూత అందించడం లేదు. స్థానికంగా ఉన్న హట్సన్ ఆగ్రో ప్రొడక్ట్ కంపెనీ వారు పాలను తీసుకోవడం లేదు. విజయ డెయిరీ పాలలో నాణ్యత లోపం చూపుతున్నారు. వేల రూపాయ లు పెట్టుబడి పెట్టి పాలు ఉత్పత్తి చేస్తూ నష్టపోతున్నామని పాడి రైతులు వాపోతున్నారు. న్యాయం చేయాలన్న డిమాండ్‌లతో జహీరాబాద్ ప్రాంతంలోని పోరాటం చేయాలని నిర్ణయించారు.

నాణ్యత పేరుతో తక్కువ ధర

జహీరాబాద్ ప్రాంతంలో సుమారు వంద వరకు డెయిరీ ఫామ్‌లు ఉన్నాయి. పాలు సేకరిస్తున్న డెయిరీలు, ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీ, హట్సన్ ఆగ్రో కంపెనీపై పాడి రైతులు ఆధారపడ్డారు. కానీ హట్సన్ కంపెనీ వారు జహీరాబాద్ రైతుల నుంచి లీటర్ పాలను కూడా కొనడం లేదు. విజయ డెయిరీ నాణ్యత పేరుతో తక్కువ ధర చెల్లిస్తుంది. ప్రైవేట్ డెయిరీల నిర్వాహకులు తక్కువ ధరకే పాలను కొంటున్నారు. దీంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. పశువుల ధరలు, పశుగ్రాసం సాగు, దాణా, గేదెల పోషణ, వైద్యం ఖర్చులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పాలు అమ్మినా గిట్టుబాటుకాక ఆందోళన చెందుతున్నారు. పోషణ భారం మోయలేక పశువులను విక్రయిస్తున్నారు.



ధర్నా అనుమతి కోరుతూ ఎస్‌ఐ కాశీనాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న పాడి రైతులు

నేడు పట్టణంలో ధర్నా



బూచినెల్లి వద్ద డెయిరీ ఫామ్

పలు కారణాలతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నేడు (గురువారం) పట్టణంలో ధర్నా చేపడుతున్నట్లు పాడి రైతు విష్ణు తెలిపారు. జహీరాబాద్ సమీపంలోని హట్సన్ ఆగ్రో కంపెనీ వారు నిబంధనలు పాటించడంలేదని, డెయిరీలు పాలను సేకరించడంలేదన్నారు. హట్సన్ కంపెనీకి మహారాష్ట్ర, కర్నాటక నుంచి లక్ష లీటర్ వరకు పాలు వస్తున్నాయన్నారు. కానీ స్థానిక పాడి రైతుల నుంచి కొనుగోలు చేయడంలేదన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ నిరసన తెలుపుతున్నామని చెప్పుకొచ్చారు.

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం


నర్సాపూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. ఆమె బుధవారం పలువురు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన సర్వేష్, నాగేశ్వర్‌రావులకు చెక్కులు అందజేశారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, నయిమోద్దీన్, భిక్షపతి, ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, షేక్‌హుస్సేన్ తదితరులు ఉన్నారు.

మల్లు స్వరాజ్యానికి నివాళి


చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు సందబోయిన ఎల్లయ్య పేర్కొన్నారు. మల్లు స్వరాజ్యం 3వ వర్ధంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొని తుపాకి చేతబట్టి, రజాకారుల దుర్మార్గాలను పాటల రూపంలో పాడుతూ ప్రజలను చైతన్యవంతులను చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగారెడ్డి, అహ్మద్, శేఖర్, ప్రవీణ్, నరేశ్ పాల్గొన్నారు.

కేసీఆర్ కనబడటం లేదంటూ ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): కేసీఆర్ కనబడటం లేదంటూ జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సాయికిరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం వర్గల్ గౌరారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన కేసీఆర్ ప్రజలకు అందుబాటులో లేకుండ పోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్‌నాయకులు కొండల్‌రెడ్డి, ప్రశాంత్, మధు, నవీన్ పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణం పరిశీలన


శివయోగి గురువుతో ఆలయ కమిటీ సభ్యులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలోని తాంబేలు గుట్టపై నూతనంగా నిర్మిస్తున్న జీవన జ్యోతిర్లింగ శివాలయాన్ని సదాశివపేట మండలం తంగేడిపల్లి గురువు శివయోగి శివాచార్య మహాస్వామి బుధవారం సందర్శించారు. ఆలయ నిర్మాణం జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించారు. ఆలయాల నిర్మాణంలో గ్రామస్తులు చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమన్నారు. హిందువులు ఆలయాలను నిర్మించుకోవడం శుభపరిణామం కొనియాడారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు గ్రామపెద్దలు గురువును సన్మానించి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కాలిబూడిదైన తాటిచెట్లు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం అంతక్కపేట గ్రామంలోని ఊరచెరువు కట్టపై ప్రమాదవశాత్తు తాటిచెట్లకు మంటలంటుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... ప్రమాదవశాత్తు కట్టపై ఉన్న రెండు తాటిచెట్లకు మంటలంటుకున్నాయి.ఫైర్ ఇంజిన్ సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సకాలంలో మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పిదని గౌడ కులస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

ముగిసిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లాలో జరిగిన ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారంతో ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 18,616 మందికి గానూ 17,989 మంది విద్యార్థులు హాజరు కాగా, 627 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విభాగంలో 17,232 మంది విద్యార్థులకు గానూ 16.762 మంది హాజరు కాగా 470 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,384 మంది విద్యార్థులకు గానూ 1227 మంది హాజరు కాగా 157 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి 02, డీఈసీ సభ్యులు హెచ్‌పీసీ సభ్యులు 05, ఫ్లయింగ్ స్క్వాడ్ 13, సిట్టింగ్ స్క్వాడ్ 08 బృందాలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయి.

ప్రజా‘వాణి’ వినిపించదా..?

- ప్రతీవారం కలెక్టరేట్‌కు ప్రదక్షిణలే..
- ఏళ్లు గడుస్తున్నా పరిష్కారం కాని సమస్యలు
- రెవెన్యూ సమస్యలే అధికం
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు


ప్రజావాణిలో బారులు తీరిన అర్జీదారులు

సంగారెడ్డి జోన్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే ప్రజావాణిలో తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని అర్జీదారులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో రెవెన్యూ సమస్యలే అధికంగా వస్తున్నాయి. దరఖాస్తులు స్వీకరించడమే గాని పరిష్కారానికి నోచుకోవటం లేదని అర్జీదారులు వాపోతున్నారు. సంవత్సరాలు, నెలలు గడుస్తున్నా ఎందుకు పరిష్కారం కావడం లేదో అర్థం కావడం లేదని చెబుతున్నారు. పలుమార్లు దరఖాస్తులు రిజెక్ట్ అయినా కారణం ఏమిటో అధికారులు మాత్రం చెప్పటం లేదంటున్నారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో మళ్లీ మళ్లీ రాక తప్పడం లేదంటున్నారు. తమ సమస్యల పరిష్కారానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చి అధికారులకు తమ గోడు వినిపించుకుంటున్నారు.

రెవెన్యూ సమస్యలే అధికం

ప్రజావాణిలో అధికంగా భూములకు సంబంధించిన దరఖాస్తుల ఎక్కువగా ఉంటున్నాయి. పట్టా పాసు పుస్తకం రాకపోవడం, భూమి వివరాలు సరైన విధంగా ఆన్ లైన్ లో ఉండకపోవడం, పాసు పుస్తకాలలో పేరు మార్పడం, ధరణి పోర్టల్ లో వివరాలు చూపించకపోవడం, భూ సర్వేలు ఆలస్యంతో పాటు వివిధ రకాల సమస్యలు ఉంటున్నాయి. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసిన కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని సమాచారం. ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అర్జీదారులు కోరుతున్నారు.

ధరణి పోర్టల్‌లో చూపించటం లేదు


నాకు సర్వే నెం. 397/ఆలో 4 ఎకరాల 5గుంటల వ్యవసాయ భూమి ఉంది. అందులో 2 ఎకరాల 275 గుంటల భూమి ధరణి పోర్టల్‌లో చూపించడం లేదు. సెప్టెంబర్2, 2022లో డాటా కరెక్షన్ కొరకు దరఖాస్తు చేసుకున్నా. పలుమార్లు దరఖాస్తు రిజెక్ట్ చేసినా కారణం ఏమిటో తెలియడం లేదు.

-యాసిన్ షరీఫ్, పెద్ద కంజర్ల, పటాన్ చెరు

పేరు మార్చడం లేదు


మా తండ్రి లక్ష్మయ్య 13సెప్టెంబర్ 2016 లో మృతి చెందాడు. సర్వే నెం. 92/65లో 3.30 గుంటల వ్యవసాయ భూమి మా నాన్న పేరుపై ఉంది. ఇట్టి భూమిని మా అమ్మ మాణెమ్మ పేరు పై మార్చాలని దరఖాస్తు పెట్టుకున్నప్పటికీ ఐదేళ్లు గడుస్తున్నా పట్టా పాస్ పుస్తకంలో పేరు మార్చడం లేదు. పలుమార్లు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదు. అధికారులు చర్యలు తీసుకొని పట్టా పాస్ పుస్తకంలో పేరు మార్చాలి.

-కృష్ణ, మునిదేవునిపల్లి, కొండాపూర్

ఆన్‌లైన్‌లో భూమి చూపించడం లేదు


మా గ్రామంలోని సర్వే నెం.294/ఆ2 లో 0.20 గుంటల భూమి ఆన్‌లైన్‌లో చూపించడం లేదు. దీంతో మిస్సింగ్ లో భాగంగా 18జులై 2024 సంవత్సరంలో మీ సేవలో దరఖాస్తు చేసుకున్నాం. స్థానిక తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కొన్ని నెలలుగా తిరుగుతున్నా సమస్యను పరిష్కరించడం లేదు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు అయ్యే విధంగా చూడాలి.

-లక్ష్మప్ప, ఎల్గోయి, ఝరాసంగం

సర్వే చేసేందుకు లంచం అడుగుతున్నారు


నాకు ఉన్న వ్యవసాయ భూమి సర్వే నెం. 72లో 1.20 గుంటల భూమి అవసరాల నిమిత్తం అమ్మడం జరిగింది. కొనుగోలు చేసిన వ్యక్తి సర్వే చేసి ఇవ్వమని అడగడంతో సర్వే కొరకు అధికారులకు దరఖాస్తు చేసుకున్నా. సర్వే చేసేందుకు రూ. 2,50,000 డబ్బులు ఇవ్వాలని తహసీల్దార్ డిమాండ్ చేస్తున్నారు. లంచం అడిగినందుకు అధికారులపై చర్యలు తీసుకోవాలి. త్వరితగతిన నేను అమ్మిన భూమి సర్వే చేయించాలని కోరుతున్నా.

-నగేష్, పోసన్‌పల్లి, చౌటకూర్

ఆదర్శ పెళ్లి

- కట్నకానుకలు లేవు
- ఆగిన పెళ్లిని జరిపించిన గ్రామస్తులు


ఆదర్శ వివాహం చేసుకొని ఒక్కటైన విఠల్, పల్లవి దంపతులు

కల్హేర్(నారాయణఖేడ్): గ్రామస్తులు కలుగజేసుకుని కట్నకానుకలు లేకుండా ఆదర్శ పెళ్లి చేశారు. బుధవారం రాత్రి కల్హేర్ మండలం మార్డిలో హన్మాన్ మందిరం వివాహానికి వేదికైంది. అప్పటికప్పుడే బాజాభజంత్రీలు, వేదమంత్రాల మధ్య నవ దంపతులు మూడు ముళ్ల బంధంతో ఒకటయ్యారు. గ్రామానికి చెందిన కురుమ భూమయ్య లక్ష్మి దంపతుల కూతురు పల్లవి వివాహం అదే గ్రామానికి చెందిన హన్మండ్లు గంగామణి దంపతుల కుమారుడు విఠల్‌తో జరిపేందుకు నిశ్చయించారు. ఈ నెల 9న పెళ్లి ముహూర్తం కుదిర్చారు. అనివార్య కారణాలతో అప్పట్లో పెళ్లి ఆగింది. దీంతో గ్రామస్తులు, ఇరువురు కుటుంబీకులు జోక్యం చేసుకుని హనుమాన్ మందిరం వద్ద కూర్చుని మాట్లాడారు. ఇరువురిని నచ్చజెప్పారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల దీవెనలతో విఠల్ పల్లవి దంపతులయ్యారు. కట్నకానుకలు లేకుండా పెళ్లి చేసుకోవడంతో గ్రామస్తులు దంపతులిద్దరిని అభినందించారు.

బీమా ఏజెంట్ల సమస్యలు పార్లమెంటులో ప్రస్తావిస్తా

ఎంపీ సురేష్ షెట్కార్


ఎంపీ సురేష్ షెట్కార్‌ను కలిసిన బీమా ఏజెంట్లు

నారాయణఖేడ్: జీవిత బీమా సంస్థలో పని చేస్తున్న ఏజెంట్ల సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ హామీ ఇచ్చారు. వివిధ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ బుధవారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో అఖిలభారత బీమా ఏజెంట్ల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఖేడ్ ప్రాంత ఏజెంట్ల కోరిక మేరకు ధర్నాలో పాల్గొని ఆయన మాట్లాడారు. జీవితబీమా సంస్థ ప్రపంచంలోనే మూడోస్థానంలో ఉండి దేశవ్యాప్తంగా 14 లక్షల మంది ఏజెంట్లుగా పనిచేస్తుండగా 30 కోట్ల మంది పాలసీదారులుగా ఉన్నారన్నారు. పాలసీదారులపై జీఎస్టీని తొలగించాలని, ఏజెంట్లకు సంబంధించిన వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తాను పార్లమెంటులో ప్రస్తావిస్తానని అన్నారు. ఎంపీని కలిసినవారిలో జహీరాబాద్, ఖేడ్ డివిజన్‌ల ఏజెంట్లు విఠల్ గౌడ్, మాధవరావు, వెంకటేశం, దుర్గయ్య, కాశీనాథ్, తుకారాం, మోహన్‌సింగ్, రాంచందర్, కృష్ణారావు, సంగారెడ్డి, అశోక్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షణీయం


అక్కన్నపేటలో మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నంగునూరు(సిద్దిపేట), అక్కన్నపేట(హుస్నాబాద్),బెజ్జంకి(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడం హర్షణీయమని ఎంఎస్పీ మండలశాఖ అధ్యక్షుడు బాలరాజు అన్నారు.బుధవారం ఎంఎస్పీ నాయకులు నంగునూరులో మంద కృష్ణమాదిగ, బాబు జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, కనకయ్య, రాజయ్య, యాదయ్య, నరేశ్, హరిబాబు, కనకయ్య, భూమయ్య, నర్సింగారావు పాల్గొన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు ముత్యాలస్వాం కిరణ్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, రవీందర్, సారయ్య, అనిల్, రామస్వామి పాల్గొన్నారు. బెజ్జంకి ఎంఆర్‌పీఎస్ నాయకులు మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పర్శరాములు, నియోజకవర్గ ఇన్‌చార్జి పర్శరాములు, తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడం సంతోషకరమని ఎంఆర్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కపల్లి రాజు అన్నారు. బుధవారం దుబ్బాక పట్టణంలో బాబుజగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లం, రాజమల్లు, మహేశ్, రాంచంద్రం, జోగయ్య, తదితరులున్నారు.

ఫైపులైన్ లీకేజీతో నీటి సమస్య


లీకేజీ వల్ల రోడ్డుపై నుంచి పారుతున్న నీరు

జహీరాబాద్ టౌన్: మండలంలోని దిడ్గి గ్రామంలో పైపులైన్ లీకేజీతో నీటి సమస్య నెలకుందని గ్రామస్తులు వాపోయారు. నెలరోజులు అవుతున్న లీకేజీలకు మరమ్మతులు చేపట్టడం లేదని మండిపడ్డారు. వాటర్ ట్యాంక్ నుంచి గ్రామంలోని పలు వార్డులకు నీటి సరఫరా అవుతుందని, పైపులైన్ లీకేజీ వల్ల నీటి సరఫరాకు అంతరాయం కల్గుతుందని తెలిపారు. ఎస్సీ కాలనీలోని చేతి పంపు చెడిపోయినా మరమ్మతులు చేపట్టడంలేదని చెప్పారు. గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శిగా ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో సొంత ఖర్చులతో రిపేరు చేయించుకుమని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్ లీకేజీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

హౌసింగ్ పీడీ చలపతి


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ చలపతి

కల్హేర్(నారాయణఖేడ్): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు హౌసింగ్ పీడీ చలపతి తెలిపారు. బుధవారం సిర్గాపూర్ మండలం గైర్హాన్ తండాలో ఇందిరమ్మ ఇళ్లపై లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించారు. అలాగే, మండల పరిషత్తు కార్యాలయంలో అధికారులతో సమీక్ష జరిపారు. కార్యక్రమంలో డీఈఈ తివారీ, ఎఈ సత్యనారాయణ, ఎంపీడీఓ మల్సూర్, ఏపీఓ రమేష్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు

కల్హేర్(నారాయణఖేడ్): పేకాట ఆడుతున్న 11 మందిపై కేసు నమోదు చేసినట్లు సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం సిర్గాపూర్ మండలం వంగ్దల్ శివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.13,100 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం ఏకగ్రీవం

కొండపాక(గజ్వేల్): కొండపాక మండల ఎంఆర్పీఎస్ నూతన కార్యవర్గం దుద్దెడ శివారులో గల ఎల్లమ్మ దేవాలయం వద్ద బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దొమ్మాట చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడిగా లింగాపురం నర్సింలు, ఉపాధ్యక్షులుగా విరుపాక సంజు, వెల్కటూర్ రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, అధికార ప్రతినిధి రవి, సహాయ కార్యదర్శి పర్శరాంలు, స్వామి, కార్యవర్గ సభ్యులు సురేశ్, రాజు,సాయికిరణ్,మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం


సమావేశంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని అంకిరెడ్డిపల్లి హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు కొడారి నర్సింలు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం చంద్రమౌళి మాట్లాడుతూ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించేలా స్పెషల్ క్లాసలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు రాసేటప్పుడు ఒత్తిడికి గురికావొద్దు

బీసీ జిల్లా అధ్యక్షుడు కందూరి ఐలయ్య


లకుదారం హైస్కూల్లో పరీక్షల సామగ్రి అందజేసిన బీసీ జిల్లా అధ్యక్షులుఐలయ్య

కొండపాక(గజ్వేల్): పరీక్షలు రాసేటప్పుడు ఒత్తిడికి గురికావొద్దని బీసీ జిల్లా అధ్యక్షుడు కందూరి ఐలయ్య కోరారు. కుకునూరుపల్లి మండలంలోని లకుదరాం గ్రామంలోని హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కందూరి ఐలయ్య మాట్లాడుతూ గతంలో మాదిరిగా జీపీఏ ఉండదని మార్కుల ఆధారంగా ఉత్తీర్ణత శాతాన్ని పరిగణలోకి తీసుకుంటారన్నారు. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషికాన్ని అందజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రాచన్నపేటలో రెండు రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో కార్పెంట్ దుకాణం కాలిపోయిందిద. బాధితి కుటుంబానికి మాణిక్‌ప్రభు స్కూల్ యాజమాన్యం ఆర్థిక సహాయం అందించింది. అగ్నిప్రమాదంలో కార్పెంటర్ మారుతి దుకాణం పూర్తిగా కాలిపోయి నష్టపోయాడు. నిరుపేద కావడంతో కుటుంబాన్ని ఆదుకోనేందుకు కరస్పాండెంట్ వెంకటయ్య బాధితుడి భార్య సువర్ణకు రూ. 10 వేల నగదు బుధవారం అందజేశారు. నామ సుభద్రమ్మ మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడు నామ రవికిరణ్, పూర్వ విద్యార్థులు మారుతికి రూ. 25 వేల విలువ గల కార్పెంటర్ పరికరాలను కొనుగోలు చేసి అందజేశారు. కార్యక్రమంలో నామ రవికిరణ్, నరేష్ రెడ్డి, అల్లాడి వేణుగోపాల్, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ ఆందోళన


దుబ్బాకలో ఆందోళన చేస్తున్న మాలమహానాడు నాయకులు

దుబ్బాక: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ పై కాంగ్రెస్ ప్రభుత్వం తీర్మానం చేయడం పట్ల బుధవారం దుబ్బాకలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. దళితుల మధ్యన చిచ్చు పెట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణ డ్రామాలు ఆడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర నాయకులు కాల్వ నరేష్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కాల్వ లింగం, స్వామి, చిన్నముత్యం , బక్కయ్య తదితరులు ఉన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..


సీసీ రోడ్డు పనుల ప్రారంభిస్తున్న నాయకులు

మునిపల్లి(అందోల్): ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ సహకారంతో అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు ప్రదీప్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మేళసంగ్యం గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ.. అవసరమున్న చోట సీసీ రోడ్డు, మురికి కాలువల నిర్మాణం పనులను నిర్వహిస్తున్నామన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ్మ అధ్వర్యంలో అందోల్ నియోజక వర్గంలో సుమారు రూ.40 కోట్లతో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల, జెఎన్‌టీయూ, ఆయా పాఠశాలలు, గ్రామాల్లో సీసీరోడ్లు, బీటీ రోడ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే సీసీ రోడ్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


స్వయంపాలన దినోత్సవంలో విద్యార్థులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం కొడకంచి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రేమావతి మాట్లాడుతూ... విద్యార్థులు బాగా చదివి పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. స్వయం పాలన దినోత్సవంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులతో కలిసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మొగులయ్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ


కౌడిపల్లి(నర్సాపూర్): ముట్రాజ్‌పల్లిలో ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేస్తున్న యూత్ సభ్యులు


నిజాంపేట(మెదక్): నార్లాపూర్‌లో..

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్ష ప్యాడ్లను యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జగన్ మాట్లాడారు. విద్యార్థులు భయపడకుండా పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, యుఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు బాబు పాల్గొన్నారు.

బొడ్మట్‌పల్లిలో..


టేక్మాల్(మెదక్): బొడ్మట్‌పల్లిలో ..

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన భవాని నగేశ్ పరీక్షా ప్యాడ్‌లను, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం స్వప్న మాట్లాడారు. ఇందులో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ యాదమ్మ, ఉపాధ్యాయులు కృష్ణ, అశోక్, దశరథ్, లత, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.


పాపన్నపేట(మెదక్) : ప్యాడ్‌లు అందజేత

పాపన్నపేట(మెదక్): మండలం పొడిచన్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు యువజన సంఘం ప్రతినిధి సంతోష్ రెడ్డి పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రుక్మారెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముట్రాజ్‌పల్లిలో ..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముట్రాజ్‌పల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రాజిపేట గ్రామానికి చెందిన వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎండీ ఫహీం, యూత్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.